తల్లీబిడ్డలకు ఆరోగ్య రక్ష

- శరవేగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ
- గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణ
- సమతులాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం


లబ్ధిదారులకు పోషకాహారం కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు (ఫైల్)

కాజులూరు: తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. పోషక విలువలు కలిగిన ఆహారం అందినప్పుడే గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారి నుంచి రక్షణ పొందుతారు. శిశువులు కూడా ఆరోగ్యంగా పెరుగుతారు. ఇదే లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని నేరుగా ఇంటికే అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పండంటి బిడ్డకు జన్మనివ్వాలని కలలు కంటున్న గర్భిణులను రక్తహీనత సమస్య ఎక్కువగా వెంటాడుతోంది. దీంతో పుట్టే బిడ్డలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాగే పాలిచ్చే తల్లులకు (బాలింతలకు) పోషకాహారం అందకపోతే పిల్లలకు పోషకాలు అందవు. ఈ విధంగా పౌష్టికాహార లోపం మాతాశిశువులిద్దరికీ ఎంతో కీడు చేస్తోంది. అందుకే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ కింద 10 రకాల పోషకాలను కిట్ల రూపంలో ఇంటికే అందిస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా గర్భిణులు, బాలింతలను నమోదు చేసి ఈ పోషకాలను అందిస్తున్నారు. పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు, బాలింతలకు సమృద్ధిగా పాలు ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లు ఎంతో దోహదపడతాయి. గర్భిణిగా నమోదైన నాటి నుంచి పుట్టిన బిడ్డకు ఆరో నెల పూర్తయ్యే వరకూ సమతులాహారం అందిస్తున్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు బాలామృతంతో పాటు గుడ్లు, పాలు ఇస్తున్నారు. ఈ నెల ఐదో తేదీన మండలంలోని శీల గ్రామంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పలువురు మహిళలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ ప్రారంభించారు. మండలంలోని మొత్తం 376 మంది గర్భిణులకు, 331 మంది బాలింతలకు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ కిట్లు పంపిణీ చేశారు.

అందిస్తున్న పోషకాహారం ఇదీ..

వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా పోషకాలు కలిసిన మూడు కేజీల ఫోర్టిఫైడ్ బియ్యం, కేజీ కందిపప్పు, అర లీటరు ఆయిల్, 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, 2 కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, పావు కేజీ చిక్కీలు, పావు కేజీ ఖర్జూరం, పావు కేజీ బెల్లం ఇస్తున్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది పోషకాలతో కూడిన సరకులు పంపిణీ చేస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం సమతులాహారం అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.
– గంజా లోవశ్రీ, శ్రీరామ్‌నగర్ కాలనీ, కాజులూరు

ఎంతో ఉపయోగం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా 10 రకాల పోషకాహార సరకులను ఇంటికే తెచ్చి అందించడం చాలా బాగుంది. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.
– శీలం నిర్మలాజ్యోతి, ఆర్యావటం

మాతా శిశువులకు మేలు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవటం ద్వారా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించవచ్చు. గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ఆరో నెల బాలింత వరకూ ఇంటికే సరకులు అందిస్తున్నాం. ఇది మాతాశిశువులకు ఎంతో మేలు.
– బి.మాధవీలత, సీడీపీఓ, ఐసీడీఎస్, తాళ్లరేవు

క్లుప్తంగా

‘హర్ ఘర్ తిరంగా’ విజయవంతం చేయాలి


ఎమ్మెల్సీ త్రిమూర్తులుకు జాతీయ జెండాను అందజేస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

మండపేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్వాతంత్య్ర దిన వేడుకల సందర్భంగా త్రివర్ణ పతాకాలను తపాలా శాఖ పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉంచింది. రూ. 25 ధరకే జెండాలను అందిస్తోంది. ఇందులో భాగంగా గురువారం మండపేట తపాలా ఉద్యోగులు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలసి జాతీయ జెండాను అందజేసి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి స్వాతంత్య్ర స్ఫూర్తిని చాటాలన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ, హెడ్ పోస్టుమాస్టర్ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ పోస్టుమాస్టర్ టపా పుల్లేశ్వరరావు, పోస్టల్ ఉద్యోగులు కొండపల్లి సూర్యనారాయణ, నారాయణ పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు 6 నామినేషన్లు

రామచంద్రపురం రూరల్: ఓదూరు సర్పంచ్ బుంగ మేరీ మృతితో జరుగుతున్న ఉప ఎన్నికకు సంబంధించి చివరి రోజైన గురువారం 6 నామినేషన్లు దాఖలయ్యాయి. బుంగ మేరీ అత్త బుల్లమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఆమెతో పాటు వింజుమల్ల విమలకుమారి, వింజుమల్ల చందుశ్రీ, కాలుకురచ మణికుమారి, కోణాల అనంతలక్ష్మి, తాతపూడి గంగాభవాని కూడా నామినేషన్లు వేశారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి

మండపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని కేశవరం సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ మూర్తి అన్నారు. గురువారం కేశవరం పంచాయతీ కార్యాలయం వద్ద గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయన పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం టేక్ హోం రేషన్ కింద ఇంటికే సరకులను అందిస్తోందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. గ్రామ కార్యదర్శి సుబ్బారావు, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇద్దాం

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రిక, అంగరలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులకు గురువారం పీహెచ్‌సీ సిబ్బంది చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎల్‌హెచ్‌పీ ఎన్.దేవి మాట్లాడుతూ శరీర భాగాల్లో చేతులు నోటిని తాకడం అనివార్యమైనందున తప్పనిసరిగా చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆహారం తీసుకునే ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత, ఇతర వస్తువులను తాకిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా క్రిముల బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వైద్య ఆరోగ్య కార్యకర్తలు వెన్నేటి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన బేబి పాల్గొన్నారు.

రేపు రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

మండపేట: స్థానిక రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం ఈ నెల 12న జరుగునుందని సంఘ కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. ఇక్కడి రామహిందు మున్సిపల్ స్కూల్‌లో సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో డీఆర్ వివరాలు, ఇన్‌కంటాక్స్, ఈకేవైసీ, లైఫ్ సర్టిఫికెట్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులంతా హాజరుకావాలని గోవిందరావు గురువారం ఓ ప్రకటనలో కోరారు.

నారుమడుల దశ కీలకం

కాజులూరు: వరి సాగులో నారుమడుల దశ కీలకమైనదని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. చేదువాడ, బందనపూడి తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి, రైతులకు పలు సూచనలు చేశారు. చేదువాడలో మాట్లాడుతూ, నారు ఆరోగ్యంగా ఉంటేనే పంట బలంగా పెరుగుతుందన్నారు. వరి సాగులో అనవసర వ్యయాలు తగ్గించి, అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జెడ్పీ మాజీ చైర్మన్‌కు మాతృ వియోగం

కాజులూరు: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు తల్లి సూర్యకాంతం (92) తూరంగిలోని తన నివాసంలో గురువారం ఉదయం మృతి చెందారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు బుల్లిరాజు.

గ్రామ సచివాలయం, సీసీ రోడ్ల ప్రారంభం


అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: అన్నాయిపేటలో సుమారు రూ.45 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్ (బాబీ), సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మంత్రి తనయుడు నరేన్, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు తుమ్మూరి సుబ్బలక్ష్మి, రెడ్నం సతీష్, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, పిల్లి సూర్యప్రకాశరావు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

14న మండల పరిషత్ సమావేశం

కపిలేశ్వరపురం: స్థానిక మండల సర్వసభ్య సమావేశాన్ని 14న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. సంబంధిత అధికారులు వారి శాఖలకు చెందిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

వ్యవసాయ పరపతి పెంచేందుకు కృషి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


కాలేరు పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: వ్యవసాయ పరపతి పెంచేందుకు పీఏసీఎస్ పాలకవర్గం కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆకాంక్షించారు. స్థానిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో గురువారం కాలేరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా చుండ్రు అమ్మన్న, డైరెక్టర్లుగా మాసాబత్తుల కామేశ్వరరావు, అనుసూరి రాములచే మండపేట డీసీసీబీ బ్రాంచి మేనేజర్ శంకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, మండల పరిషత్ విప్, ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రైతు ప్రయోజనాలు కాపాడేందుకు పని చేస్తున్నామన్నారు. చైర్మన్ అమ్మన్న, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ టేకి సత్యమంజు, నాయకులు ఏలేటి గంగరాజు, రెడ్డి రుద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

పితృ వియోగంతో బాధపడుతున్న టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల పీఎంసీ చైర్మన్ గుత్తుల వీరభద్రరావును ఎమ్మెల్సీ త్రిమూర్తులు పరామర్శించారు. కోరుమిల్లికి చెందిన గంగుమళ్ల వీర్రాజు, వానపల్లి పాప ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న చినకోరుమిల్లికి చెందిన మారిశెట్టి వీరన్నను కలసి జాగ్రత్తలు చెప్పారు. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, మండల సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, నాయకులు శీలం గోవింద్, సలాది అప్పారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం


అంగర హైస్కూల్‌లో మాత్రల పంపిణీని పర్యవేక్షిస్తున్న సుదర్శన్‌బాబు


రాయవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినికి మాత్రలు వేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

కపిలేశ్వరపురం: చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వైద్య ఆరోగ్య శాఖ రామచంద్రపురం సబ్ డివిజనల్ అధికారి ఆర్.సుదర్శన్‌బాబు అన్నారు. అంగర జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఇప్పటికే సిబ్బంది మండలంలోని మూడు పీహెచ్‌ల పరిధిలో 93 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయడంపై ఆయన అభినందించారు. అంగర పీహెచ్‌సీ లక్ష్యం 3,960 కాగా 3,719 మందికి మాత్రలను వేశామన్నారు. ఆయా పీహెచ్‌సీల వైద్యులు పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, పి.చంద్రమౌళి, కె.కరుణేంద్రకుమారి పర్యవేక్షించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఏసలు పి.సురేష్, కామేశ్వరరావు, ఎస్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: నులి పురుగుల కారణంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు అనారోగ్య సమస్యలతో బాధపడతారని ఏడిద సర్పంచ్, రిటైర్డ్ వైద్య ఉద్యోగి బూరిగ ఆశీర్వాదం అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఆ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు వారందరితో ఈ మాత్రలు మింగించాలని సూచించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక రాజేశ్వరికాలనీలోని మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణతో కలసి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అంగర దేవిరాజశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు దేవిరాజశ్రీ మాట్లాడుతూ రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో 8,972 మందికి డీవార్మింగ్ మాత్రలు మింగించడం లక్ష్యమన్నారు. ఎంఈవో–2 సూర్యనారాయణ, హెచ్ఎం ఎల్.వెంకటరమణ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


అన్నాయిపేటలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పాలన అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. అన్నాయిపేటలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు తమ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమాన్ని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మిరెడ్డి నాగేశ్వరరావు(దొరబాబు), ఉప సర్పంచ్ చల్లా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పాలిక అప్పారావు, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం

కె.గంగవరం: చిన్నారుల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగులను నివారిద్దామని కుందూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రత్నసుధ, పామర్రు పీహెచ్‌సీ వైద్యులు మాణిక్యం అన్నారు. దంగేరు, పామర్రు, కుందూరు, పేకేరు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో జాతీయ నులి పురుగు నివారణ దినం నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులకు వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేసి, మింగించారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల కడుపులోని నులిపురుగులను నివారించవచ్చని వైద్యాధికారులు చెప్పారు. పామర్రు పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 2,697 మంది చిన్నారులు ఉండగా మొదటి రోజునే 2,603 మందికి మాత్రలు పంపిణీ చేశామని సూపర్‌వైజర్ మల్లికార్జునుడు తెలిపారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: జాతీయ నులిపురుగుల నివారణా కార్యక్రమంలో భాగంగా ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లోని విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో జెడ్పీటీసీ సభ్యుడు మేర్నిడి వెంకటేశ్వరావు, ఎంపీపీ అంబటి భవాని, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజులు చిన్నారులకు మాత్రలు వేశారు. ప్రధానోపాధ్యాయిని జి.రాజేశ్వరి, ఎంపీహెచ్ఈఓ గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగి అదృశ్యం


మాధవరావు (ఫైల్)

మండపేట: పెద్దాపురం మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగి యరమాటి మాధవరావు అదృశ్యంపై ఆయన భార్య మాధవి ఫిర్యాదు మేరకు గురువారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన మాధవరావు అప్పులబాధ తాళలేక గతంలో అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి కొద్దిరోజులకు తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో పెద్దాపురం నుంచి స్వస్థలమైన మండపేటకు మకాం మార్చారు. కాగా జూన్ 25న పెద్దాపురం మున్సిపల్ కార్యాలయానికి వెళుతున్నానని చెప్పి బయలుదేరిన మాధవరావు నెల రోజులు పైబడిన ఇంటికి తిరిగి రాకపోవడంపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్యాగధనులను స్మరించుకుందాం..


వెంటూరులో సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


అర్తమూరులో దీపాలతో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి తదితరులు


వడ్లమూరులో మొక్క నాటుతున్న సర్పంచ్ మంగాదేవి, ఎంపీటీసీ మధు

వాడవాడలా నాభూమి– నాదేశం

రాయవరం: స్వాతంత్య్రోద్యమ ఘట్టాలు, సమరయోధుల త్యాగాల నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. గురువారం కూర్మాపురం, వెంటూరు, చెల్లూరు గ్రామాల్లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు చౌటుపల్లి చక్రవేణి, వాసంశెట్టి వెంకట్రావు, పాలిక రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. నాభూమి– నాదేశం మట్టి నమూనాలను సేకరించారు. గ్రామాల్లో స్మారక స్తూపాలను ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. స్వాతంత్య్ర సమరయోధులు, అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. జాతీయ జెండాలు చేతపట్టి విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జె.సుధారాణి, ఆయా గ్రామాల సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు పాల్గొన్నారు.

మండపేట: స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన నా భూమి– నా దేశం, నేల తల్లికి నమస్కారం– వీరులకు వందనం కార్యక్రమాలు గ్రామ గ్రామాన జరుగుతున్నాయి. ప్రతి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద పంచప్రాణ ప్రతిజ్ఞ నిర్వహించారు. అమరుల త్యాగాలు స్మరించుకుంటూ చేతిలో మట్టిని తీసుకుని దీపాలు వెలిగించి ప్రతిజ్ఞ చేశారు. వై.సీతానగరంలో ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి, గ్రామ కార్యదర్శి ఏవీవీ రమణ, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అర్తమూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నాభూమి– నాదేశం కార్యక్రమం జరిగింది. శిలాఫలకం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత, సొసైటీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత గొలుగూరి సందీప్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి అనిల్‌కుమార్, సచివాలయ కన్వీనర్లు తేతలి భూపతిరెడ్డి, నల్లమిల్లి రాంబాబు, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మండ నాగిరెడ్డి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: ‘నా భూమి–నా దేశం’ కార్యక్రమాలను వడ్లమూరు, టేకి, వల్లూరు గ్రామాల్లో నిర్వహించారు. సర్పంచులు చుండ్రు మంగాయమ్మ, దాసి మీనాకుమారి, ఎంపీటీసీ పలివెల మధు మాట్లాడారు. వడ్లమూరు పంచాయతీ ఆవరణలో మొక్కలను నాటారు.నాయకుడు చేంబ్రోలు వీరభద్రరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చెల్లూరులో గడప గడపకూ..


చెల్లూరులో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం చెల్లూరులో సర్పంచ్ పాలిక రాఘవ, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యులు పలివెల వెంకటఆదిలక్ష్మి, వైట్ల వీరవేణి, కోనసీమ జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణలతో కలసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుల, మత, పార్టీ, ప్రాంత బేధాలకు అతీతంగా అర్హులందరికీ నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, ప్రభుత్వ పాలన సులభతరం చేసి పేదలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలు స్వాగతిస్తుంటే, ప్రతిపక్షాలు మాత్రం ప్రభుత్వాన్ని విమర్శించే పనిలో ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోమారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం పథకాలతో కూడిన కరపత్రాలను త్రిమూర్తులు ప్రజలకు అందజేశారు. సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, ఏఎంసీ డైరెక్టర్ నులుకుర్తి వీరవేణి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోడె వెంకటరమణ, నాయకులు వెలగల సత్యనారాయణరెడ్డి, పలివెల రామకృష్ణ, కోటి అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

మండపేట: మండలంలో రెండు వార్డులకు జరుగుతున్న ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ పర్వం ముగిసింది. ఏడిదలోని 1వ వార్డు, తాపేశ్వరంలోని 14వ వార్డు సభ్యుల అకాల మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. తుది గడువు ముగిసేసరికి ఏడిదకు సంబంధించి ఒకే నామినేషన్ దాఖలు కాగా, తాపేశ్వరంలోని వార్డుకు ఐదు నామినేషన్లు వచ్చినట్టు ఎంపీడీఓ ఐ రాజు తెలిపారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన జరుగనుంది. ఈనెల 19న ఉప ఎన్నిక, అదేరోజు మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆయన వివరించారు. కాగా ఏడిద పంచాయతీకి ఒకే నామినేషన్ దాఖలు కావడంతో వార్డు ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆ వార్డుకు గ్రామానికి చెందిన ఎ.నీలజ్యోతి గురువారం వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ తదితరులతో కలసి నామినేషన్ దాఖలు చేశారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

కె.గంగవరం: ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బలుసు రవి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఈ– క్రాప్ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్ఓ, వీఆర్ఏల సమక్షంలో ఈ–పంట నమోదు జరుగుతుందన్నారు. రైతులు సహకరించాలని కోరారు. విత్తనాల పంపిణీ, పంట నష్ట పరిహారం, సబ్సిడీ, రైతు భరోసా పథకం వంటివి అందించేందుకు ఈ–పంట నమోదునే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుందని చెప్పారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు భర్తీకి నోటిఫికేషన్

కాజులూరు: గొల్లపాలెం సాయిబాబా కాలనీలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఐసీడీఎస్ తాళ్లరేవు సీడీపీఓ బి.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ (వీహెచ్) కేటగిరీకి చెంది, 10వ తరగతి ఉత్తీర్ణులై గత జూలై ఒకటో తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉన్న స్థానిక వివాహిత మహిళలు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న వారు తాళ్లరేవు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్‌లపై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలన్నారు. దరఖాస్తులు సమర్పించే సమయంలో అన్ని సర్టిఫికెట్ల ఒరిజినల్స్ తీసుకురావాలన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

కె.గంగవరం: కోటిపల్లి ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను) గురువారం కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పాఠశాలలో ఏడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.90 లక్షలు మంజూరు చేసిందని ఎంపీపీ నాగమణి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని, దీనిలో భాగంగానే నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు.

టీడీపీ ప్రచారం

మండపేట: భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు గురువారం వెలగతోడులో ప్రచారం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, విత్తనాల వాణిశ్రీదేవి పాల్గొన్నారు.